సాక్షి విశాఖపట్నం
మంగళవారం । 3 । జనవరి । 2023

స్వామికి హారతి అందజేస్తున్న పురోహిత్ అలంకారి





సింహగిరిపై కళాకారుల నృత్యాభినయం

ముక్కోటి వైభవం..
భక్తకోటి సంబరం

- ఉత్తర ద్వార దర్శనంతో కిక్కిరిసిన సింహగిరి
- శేషతల్పంపై వైకుంఠవాసుడిగా అప్పన్న దర్శనం
- పరవశించిన భక్తజనం

సింహాచలం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తకోటి పరశించింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తుల కోలాహలం కనిపించింది. సింహగిరిపై కొలువైన వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శనం చేసుకుని భక్తులు తరించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి ఆలయ ఉత్తర రాజగోపురంలో శేషతల్పంపై కొలువుదీరి భక్తులకు ఉత్తరద్వార భాగ్యాన్ని అందజేశారు.

విశేషంగా వైదిక కార్యక్రమాలు

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజాము నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వైదికులు విశేషంగా పూజలు ప్రారంభించారు. స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వైకుంఠవాసుడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా తీర్చిదిద్దారు. అనంతరం స్వామి,అమ్మవార్లను మేలి ముసుగులో ఉంచి శేషతల్పంపై అధిష్ఠింపజేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. తొలుత ఆలయ ఉత్తరద్వారం వద్ద కొంతసేపు స్వామిని అధిష్ఠింపజేసి.. స్వామిపై ఉన్న మేలిముసుగు తొలగించారు. అక్కడ తొలి దర్శనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు అందజేశారు. అనంతరం స్వామిని ఉత్తర రాజగోపురంలో ఏర్పాటు చేసిన వేదికపై అధిష్ఠింపజేశారు. ఉదయం 5.45 గంటల నుంచి 10 గంటల వరకు భక్తులకు దర్శనాన్ని అందజేశారు. అనంతరం స్వామికి సింహగిరి మాడవీధిల్లో తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు.



బేడ తిరువీధిలో పాల్గొన్న అశోక్‌గజపతిరాజు దంపతులు, అర్చకులు



ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

తరలివచ్చిన ప్రముఖులు

వరాహ లక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్‌కుమార్, గణబాబు, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, **విజయనగరం కలెక్టర్ సూర్యకుమారి, విజయనగరం ఆర్డీవో ఎం.వి.సూర్యకళ, వైఎస్సార్ సీపీ విశాఖ పశ్చిమ ఎన్నికల పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు, దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు,** దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు స్వామిని దర్శించుకున్నారు.

శారదాపీఠం కులదైవం అప్పన్న స్వామి

శారదాపీఠం కులదైవం వరాహ లక్ష్మీనృసింహస్వామి అని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న అనంతరం.. ఈ నెల 27 నుంచి జరగనున్న శారదా పీఠం వార్షికోత్సవాల ఆహ్వానపత్రికను స్వామి పాదాల చెంతన ఉంచి పూజలు నిర్వహించారు. ముక్కోటి దేవతలంతా కలిసి శ్రీమన్నారాయణుడిని దర్శించుకున్న పర్వదినమే ముక్కోటి ఏకాదశి అని తెలిపారు. స్వామిని ముక్కోటి ఏకాదశి రోజున దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

అశోక్‌గజపతి సతీమణికి అస్వస్థత..
ఆలస్యంగా దర్శనాలు ప్రారంభం

ఈసారి సుమారు 45 నిమిషాలు ఆలస్యంగా సాధారణ భక్తులకు ఉత్తరద్వార దర్శనాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామికి జరిగే బేడా తిరువీధిలో దేవస్థానం ధర్మకర్త అశోక్‌గజపతిరాజు.. సతీమణి సునీలా గజపతితో కలిసి పాల్గొన్నారు. స్వామిని ఆలయ ఉత్తరద్వారం వద్దకు తీసుకొచ్చి తలుపులు తీసే ముందు సునీలా గజపతి అస్వస్థతకు గురై కింద పడిపోయారు. వెంటనే ఆమెకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కేవలం అశోక్‌గజపతిరాజు ఒక్కరే ఉత్తరద్వారంలో స్వామిని తొలిదర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి స్వామిని ఉత్తర రాజగోపురం వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఉదయం 5 గంటలకు ప్రారంభం కావాల్సిన దర్శనాలు.. 45 నిమిషాలు ఆలస్యంగా 5.45 గంటలకు ప్రారంభమయ్యాయి.



అప్పన్న సన్నిధిలో మేయర్ హరివెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఉత్తరద్వార దర్శనానికి క్యూల్లో వేచి ఉన్న జన సందోహం

కాంచిన కనులదే భాగ్యం..

- వేడుకగా వైభవ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి ఉత్తర ద్వార దర్శనం అత్యంత వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, పరిసర రహదారులు కిటకిటలాడాయి. సోమవారం వేకువజాము 2.45 గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. 3.30 గంటల నుంచి స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి దర్పణ దర్శనం, గోపృష్ఠదర్శనం, కన్యాదర్శనం నిర్వహించారు. 5.30 గంటలకు భూదేవి, శ్రీదేవి సమేతంగా స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి.. శేషవాహనంపై స్వామిని ఉత్తర ద్వారం వద్దకు తోడ్కొని వచ్చారు. అక్కడ అధిష్ఠింపజేసి 6 గంటల నుంచి దర్శనాలు ప్రారంభించారు. ముందుగా ఉత్తర ద్వారం నిర్మాత తిప్పల రవిశంకర్ కుటుంబసభ్యులు, ఆలయ ఈవో బందారు ప్రసాద్ దంపతులు, నిర్మాణ కమిటీ సభ్యులు, సంపూర్ణ సేవా భక్తులు, నిత్యపారాయణ భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు దర్శనాలకు విరామం ఇచ్చారు. సర్వాంగ వజ్రకవచంతో స్వామి దర్శనమిచ్చారు. సుమారు 25వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు. 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వైభవుడు



బారులు తీరిన భక్తులు



ప్రత్యేక వస్త్రధారణలో మహిళల సాంస్కృతిక ప్రదర్శనలు

సతా వేంకటేశం స్మరామి



శ్రీవారి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర స్వామీజీ



ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

- గోవింద నామస్మరణతో పులకించిన రుషికొండ తీరం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము 2.30 గంటలకు శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభించారు. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు శ్రీవారి దర్శనాలు నిర్విరామంగా కొనసాగాయి. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శ్రీవారి ఆలయాన్ని వివిధ వర్ణాల పూలతో.. విద్యుత్ కాంతులతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా టీటీడీ నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో యు.రమేష్, సూపరింటెండెంట్ వెంకట రమణ, ఇన్‌స్పెక్టర్లు సూర్య నారాయణరాజు, శేషుబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

న్యూస్‌రీల్

సీఐల బదిలీ

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ రేంజ్ పరిధిలో పలువురు పోలీస్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.రమేష్‌ను విశాఖ సిటీకి, పి.రమణయ్యను నర్సీపట్నం సర్కిల్‌కు, హెచ్.ఉపేంద్రను రాజాం రూరల్ సర్కిల్‌కు, పి.శ్రీనివాసరావును శ్రీకాకుళం టూ టౌన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం నర్సీపట్నం సర్కిల్‌లో విధులు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసరావును, రాజాం రూరల్ సర్కిల్ డి.నవీన్‌కుమార్‌ను, శ్రీకాకుళం జె.ఆర్ పురం సర్కిల్ బి.సీహెచ్.స్వామినాయుడును విశాఖ రేంజ్ వీఆర్‌కు పంపించారు.

స్టాఫ్ నర్స్ పోస్టుల మెరిట్ జాబితా సిద్ధం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించి మెరిట్ లిస్టును వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులు సిద్ధం చేశారు. జాబితాను మంగళవారం ఉదయం 11 గంటలకు అమరావతిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ కమిషనర్‌కు అందజేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి సోమవారం బయలుదేరి వెళ్లారు. తుది జాబితా ఆమోదముద్ర పొందిన తరువాత అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది : జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు 1.05. 2011 నుంచి 30.04.2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ www.navodaya.gov.in లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

దివ్యాంగులకు రుణాల మంజూరు

ఏయూక్యాంపస్: జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ, ఏపీ విభిన్న ప్రతిభావంతుల–వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో 8 మందికి రూ.75 వేల నుంచి రూ.5 లక్షల వరకు స్వయం సహాయక పథకాలకు రుణాలు మంజూరు చేశారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున చేతుల మీదుగా సోమవారం వీరికి రుణాలు అందించినట్లు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ సి.హెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. జేసీ కె.ఎస్ విశ్వనాథన్, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి గోపి

విశాఖలీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి ఆవిష్కరించారు. న్యాయవాదుల సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్రప్రసాద్, కార్యదర్శి వై.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నమ్మి సన్యాసిరావు, కోశాధికారి ఎ.నాయుడు, ఎంఎస్‌జే తిరుమలరావు, న్యాయమూర్తి రామ శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత, కోచ్‌ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ, భద్రతాపరమైన అంశాలపై తనిఖీలు చేశారు. సాధారణ బుకింగ్ కార్యాలయం, ఏసీ రెస్ట్ రూమ్స్, లాంజ్, ఆహార స్టాల్స్, ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. రైల్వే పరిసరాలను, కోచ్‌లను, రైల్వేస్టేషన్లను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని, చెత్తను పారవేసేందుకు సంబంధిత చెత్త కుండీలను వినియోగించాలని ప్రయాణికులకు సూచించారు. ప్రయాణ సమయంలో ఎదురయ్యే భద్రతా విషయాల్లో 139 నంబర్ లేదా సోషల్ మీడియా ద్వారా సంప్రదించవచ్చని డీఆర్‌ఎం ప్రయాణికులకు సూచించారు.

అశ్రునయనాలతో పీవీకి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- తరలివచ్చిన బీజేపీ శ్రేణులు
- ప్రధాని మోదీ, జాతీయ నాయకుల సంతాపం



పీవీ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మిజోరం గవర్నర్ హరిబాబు



పీవీ చలపతిరావు అంతిమయాత్రలో పాల్గొన్న అభిమానులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): పార్టీ శ్రేణులు, అభిమానుల అశ్రునయనాల మధ్య బీజేపీ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆ పార్టీ తొలి అధ్యక్షుడు పి.వి.చలపతిరావు అంత్యక్రియలు జరిగాయి. ప్రభుత్వ లాంఛనాలతో క్వాన్వెంట్ జంక్షన్ వద్ద చావులమదుం శ్మశాన వాటికలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు పిఠాపురంకాలనీలోని చలపతిరావు స్వగృహానికి మిజోరం గవర్నర్ డాక్టర్.కె.హరిబాబు చేరుకుని.. ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చలపతిరావు భౌతిక కాయానికి నివాళులర్పించి, తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఉమ్మడి రాష్ట్ర బీజేపీ పూర్వ అధ్యక్షుడు ఎస్.ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, మంత్రి రాజశేఖర్, శ్రీకాకుళం గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, తెలంగాణ, కర్నాటకు చెందిన బీజేపీ నేతలు చలపతిరావు పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలిపారు.

జోహార్ పీవీ

పిఠాపురంకాలనీ నుంచి పి.వి.అంతిమయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. కృష్ణా కళాశాల జంక్షన్ నుంచి ఎంవీపీకాలనీ, లాసన్స్‌బేకాలనీలోని పార్టీ కార్యాలయం వరకు, అక్కడి నుంచి సిరిపురం జంక్షన్ మీదుగా సెవెన్‌హిల్స్ కూడలి, డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా కాన్వెంట్ జంక్షన్‌లోని చావులమదుం శ్మశానవాటిక వరకు సాగింది. అంతిమయాత్రలో చలపతిరావు అభిమానులు, పార్టీ నేతలతో పాటు ఆయన తనయుడు ఎమ్మెల్సీ మాధవ్, కుటుంబ సభ్యులు, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర మోహన్, పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్రరెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగేంద్ర, పృధ్వీరాజ్, అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు. 50 బైక్‌లపై యువ మోర్చా ప్రతినిధులు ర్యాలీగా తరలివచ్చి.. జోహార్ పీవీ అంటూ నినాదాలు చేశారు.

ప్రధాని మోదీ సంతాప సందేశం

దేశ ప్రధాని మోదీ తన సంతాప సందేశాన్ని చలపతిరావు తనయుడు, ఎమ్మెల్సీ మాధవ్‌కు సోమవారం పంపించారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పీవీ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. పలువురు జాతీయ నేతలు పీవీ మృతికి సంతాపాన్ని ప్రకటించారు.



పీవీ భౌతికకాయం వద్ద ఆయన కుటుంబ సభ్యులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

చలపతిరావు సేవలు మరువలేనివి

బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.చలపతిరావు సేవలు మరువలేనివని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చలపతిరావు మరణవార్త తెలియగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమాచారం అందించామన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో చలపతిరావు అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారన్నారు.

గొప్ప నాయకుడిని కోల్పోయాం

బీజేపీ గొప్ప నాయకుడిని కోల్పోయిందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీని ఎదిరించి నిలిచిన పోరాటయోధుడు చలపతిరావు అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలను యువ నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

త్వరలోనే ‘అదానీ’కి శంకుస్థాపన



సంస్థ కార్యకలాపాల కోసం ఈ రహదారిని విస్తరించనున్న అదానీ



హిల్–4లో అదానీకి స్థలం కేటాయించినట్లు బోర్డు ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ

- హిల్–4లో 130 ఎకరాలు సిద్ధం చేసిన ఏపీఐఐసీ
- లీజు మొత్తం ప్రభుత్వానికి చెల్లించిన సంస్థ
- సరిహద్దులు సిద్ధం చేసిన ఏపీఐఐసీ
- ఏడేళ్లలో రూ.14,634 కోట్ల పెట్టుబడులు

సాక్షి, విశాఖపట్నం: రూ.14,634 కోట్లతో పాతిక వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విశాఖలో అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ పార్క్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. లీజు మొత్తం చెల్లించిన అదానీ కోసం హిల్‌పార్క్–4లో 130 ఎకరాలను ఏపీఐఐసీ సిద్ధం చేసి.. సరిహద్దులను కూడా నిర్ణయించింది. త్వరలోనే అదానీ డేటా పార్క్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన తేదీలు త్వరలోనే ఖరారు చేయనున్నారని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. డేటా సెంటర్ పార్క్, ఐటీ బిజినెస్ పార్కు, నైపుణ్యాభివృద్ధి వర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ నిర్మాణాలకు మధురవాడ సర్వే నెంబర్ 409లో ఎకరం రూ.కోటి చొప్పున 130 ఎకరాలను ప్రభుత్వం అదానీ సంస్థకు కేటాయించింది. భూమి ఇచ్చిన మూడేళ్లలోపు కచ్చితంగా కార్యకలాపాలు ప్రారంభించాలని, ఏడేళ్లలోపు నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 82 ఎకరాల్లో 200 మెగావాట్ల సామర్థ్యంలో డేటా సెంటర్ పార్కు, 28 ఎకరాల్లో ఐటీ బిజినెస్ పార్కు, 11 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, 9 ఎకరాల్లో రిక్రియేషన్ పార్కు ఏర్పాటు చేయనుంది. అదానీ కోసం కేటాయించిన స్థలానికి ఎకరానికి రూ. కోటి చొప్పున లీజు మొత్తం నిర్ణయించగా.. మొత్తం రూ.130 కోట్లుని ఇటీవలే సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి చెల్లించారు. అదానీకి అందివ్వాల్సిన భూముల సరిహద్దుల్ని ఏపీఐఐసీ సిద్ధం చేసింది. ఏడేళ్ల కాలం పాటు చెల్లించే స్టేట్ జీఎస్టీ రీయంబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించనుంది. మొదటి మూడేళ్ల కాలంలో 30 మెగా వాట్లు డేటా సెంటర్ పార్కు పూర్తి చేయడంతో పాటు, నాలుగేళ్ల నాటికి 60 మెగావాట్లు, 5 ఏళ్లకు 110 మెగావాట్లు, 6 ఏళ్లకు 160 మెగావాట్లు, ఏడేళ్లకు 200 మెగావాట్లు కింద మొత్తం వ్యవస్థని ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగ కల్పన విషయంలోనూ దశలవారీ పురోగతి చూపించనున్నారు.

మొదటి మూడేళ్ల కాలంలో 30 శాతం మందికి, ఐదేళ్ల నాటికి 70 శాతం, ఏడేళ్లకు 100 శాతం ఉద్యోగ, ఉపాధి కల్పన పూర్తి చేయనున్నారు. 200 మెగావాట్ల డేటాసెంటర్ పార్కులో 1240 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు, ఐటీ బిజినెస్ పార్కులో 1200 మందికి ప్రత్యక్ష ఉపాధి, ఐటీ బిజినెస్ పార్కు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐటీ కంపెనీల ద్వారా 21,000 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా 500 మందికి, రిక్రియేషన్ ద్వారా 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించేలా అదానీ సెంటర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఇస్కాన్‌కు భక్తుల తాకిడి



వేంకటేశ్వరుడు, పద్మావతి దేవిగా రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్‌లో అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వార దర్శనం ప్రారంభించారు. ముందుగా రాధాదామోదరులను వేంకటేశ్వర స్వామి, పద్మావతి దేవిగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు పుష్పాలతో అలంకరించారు. మంగళ హారతి, భగవద్గీత, బ్రహ్మ సంహిత పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాంబాదాస్ ప్రభూజీ వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యాన్ని వివరించారు.

30కి ప్రజా గర్జన మార్పు

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న తలపెట్టిన ప్రజా గర్జన బహిరంగ సభను ఈనెల 30కు మార్చారు. సోమవారం స్టీల్ ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన పరిరక్షణ పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గర్జన విజయవంతానికి ప్రతీ విభాగంలో, కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. 50 వేల మందికి తక్కువ కాకుండా ఉద్యోగ, కార్మిక, ప్రజలను సమీకరించాలని నిర్ణయించారు. మంగళవారం జిల్లా మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిను కలవాలని కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతి చెందిన బీజేపి నాయకులు పి.వి. చలపతిరావుకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందన అర్జీల పరిష్కారం

- కారుణ్య నియామకాల కోసం ఖాళీల జాబితా అందజేయాలి
- నిరుపేదల సహాయార్థం ముందుకురావడం అభినందనీయం
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- స్పందనకు 190 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు సకాలంలో స్పందించి వాటికి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో అర్జీలు రీ ఓపెన్ కావటానికి వీల్లేదన్నారు. ప్రజలు అందించిన వినతులను పూర్తి స్థాయిలో పరిశీలన చేసి, గడువులోగా పరిష్కరించి.. వాటి వివరాలను ఫొటోలతో సహా స్పందన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తూ, మృతి చెందిన సుమారు 112 మంది ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకం చేపట్టేందుకు శాఖల వారీగా ఖాళీల జాబితా వెంటనే అందజేయాలని అధికారులకు ఆదేశించారు. విధి నిర్వహణలో మరింత పారదర్శకత కోసమని ప్రవేశ పెట్టిన ముఖ ఆధారిత హాజరు నమోదుపై ఉన్నత స్థాయిలో ప్రత్యేక యాప్ ద్వారా శిక్షణ ఇస్తున్నందున, దీనిలో అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. నిరుపేదల సహాయార్థం 'సంజీవని రిలీఫ్ ఫండ్'కు సాయం అందించిన అధికారులు, ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 190 వినతులు అందగా.. వాటి పరిష్కారం కోసం ఆయా విభాగాల అధికారులకు సిఫార్సు చేశారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

జీవీఎంసీ స్పందనకు 51 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 51 వినతులు వచ్చాయి. జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి ఆరు, జోన్–3 నుంచి ఏడు, జోన్–4 నుంచి 13, జోన్–5 నుంచి 10, జోన్–6 నుంచి తొమ్మిది, జోన్–8 నుంచి మూడు, ప్రధాన కార్యాలయానికి సంబంధించి రెండు వినతులు వచ్చాయి. వీటిలో పరిపాలన, అకౌంట్స్, హార్టికల్చర్ విభాగానికి 2, రెవెన్యూకు 6, ప్రజారోగ్యానికి 3, టౌన్‌ప్లానింగ్‌కి 19, ఇంజనీరింగ్, ఏడీహెచ్‌కి 9, యూసీడీకి 12 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, జేడీ(అమృత్) విజయభారతి, సెక్రటరీ పి.నల్లనయ్య, డీడీ(హార్టికల్చర్) ఎం.దామోదరరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 22 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏసీపీ(ఎస్సీ, ఎస్టీ సెల్) ఎస్.బాపూజీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 22 ఫిర్యాదులు వచ్చాయి. ఏసీపీ(ఎస్సీ, ఎస్టీ సెల్) ఎస్.బాపూజీ ఫిర్యాదులు స్వీకరించగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీసీపీ, ఏడీసీపీలు, ఏసీపీలతో పాటు అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన సవరణ షాక్

- ఫైల్ అందలేదన్న ఉక్కు మంత్రిత్వశాఖ
- ఆర్టీఐతో వెలుగు చూసిన వైనం

ఉక్కునగరం: గత 14 నెలలుగా నూతన వేతనాల కోసం ఎదురు చూస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెద్ద షాక్ తగిలింది. కార్మికుల వేతన ఒప్పందం ఫైల్ బోర్డు ఆమోదం తీసుకుని ఉక్కు మంత్రిత్వశాఖ తుది ఆమోదం కోసం పంపామని యాజమాన్యం చెబుతుండగా.. సంబంధిత ఫైల్ తమకు అందలేనది ఉక్కు మంత్రిత్వశాఖ తెలపడం చర్చనీయాంశమైంది. ఈ విషయం సమాచారం హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది. 2017 నుంచి ఉక్కు కార్మికులకు నూతన వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా అనేక సమావేశాల అనంతరం 2021 అక్టోబర్‌లో ఎన్‌జేసీఎస్‌లో సెయిల్ కార్మికులకు వేతన ఒప్పందం జరిగింది. సెయిల్‌తో సమానంగా వెంటనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వేతన ఒప్పదం అమలు జరగాల్సి ఉండగా యాజమాన్యం ఎట్టకేలకు గత ఏడాది ఫిబ్రవరిలో బోర్డు ఆమోదం తీసుకున్నామని కార్మిక నాయకుల సమావేశంలో ప్రకటించింది. ఆ ఫైల్‌ను ఉక్కు మంత్రిత్వశాఖ తుది ఆమోదం కోసం పంపామని తెలిపారు. అప్పటి నుంచి కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు ఉక్కు మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీరజ్ అగర్వాల్ పంపిన సమాధానం ఉక్కు వర్గాలను నివ్వెరపరిచింది. వేతన ఒప్పందంకు సంబంధించి స్టీల్‌ప్లాంట్ నుంచి ఎటువంటి ప్రతిపాదన అందలేదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉక్కు కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం నిజంగా ఫైలు పంపితే మంత్రిత్వ శాఖ ఈ విధంగా సమాధానం ఇస్తుందా.. ఫైల్ నిజంగా పంపారా.. ఫైల్ పంపినా అందలేదని మంత్రిత్వశాఖ అబద్ధం చెబుతుందా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై కార్మిక సంఘాల చిత్తశుద్ధిపై కార్మికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా అయితే తమ పరిస్థితి ఏంటని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వామి వివేకానంద సంస్థకు అంబులెన్స్ అందజేత



అంబులెన్స్ తాళాలు అందజేస్తున్న మావూరి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నిరంతరం సేవా మార్గంలో పయనిస్తున్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థకు సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ అంబులెన్స్ వితరణ చేశారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద సోమవారం సంస్థ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం జెండా ఊపి అంబులెన్స్ సర్వీస్‌ను మావూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ సంస్థలో ఉన్న వృద్ధులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రిలో చేర్చడానికి, చనిపోయిన వారిని శ్మశానవాటికకు తీసుకెళ్లడానికి ఈ అంబులెన్స్ ఉపయోగిస్తామని చెప్పారు. అనంతరం సంస్థకు అంబులెన్స్ అందజేసిన సీఎంఆర్ అధినేతను సంస్థ సభ్యులు సత్కరించారు. ఈ నెల 5 నుంచి సంస్థలో నిర్వహిస్తున్న వివేకానంద జయంతి ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. సంస్థలో సేవ చేసే మహిళా సభ్యులకు చీరలను సీఎంఆర్ అధినేత అందజేశారు. కార్యక్రమంలో చల్మాజీ ఇన్ఫో అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు, సంస్థ సభ్యులు సత్తిబాబు, గజపతి స్వామి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

VIZIANAGARAM PLOTS
- 525 Plots in 40 Acres
- On Fast - Developing ORR 200 Feet
- Complete Gated Community
- 10 Mins From Collector Office
- High Appreciation Guaranted

888 555 2545

WANTED
APSACS ప్రాజెక్ట్ ACCEPT సంస్థ వారితో నడుపబడుచున్న Core Composite విశాఖపట్నం, గాజువాకలో Project Manager గా పనిచేయుటకు అర్హత గల అభ్యర్థులు కావలెను.
అర్హత: MSW / Sociology కంప్యూటర్ నందు పూర్తి అనుభవము కావలెను
జీతం: 15,000/- Per Month, Travel కి 1,050/- ఇవ్వబడును
Send Resumes before 7th January
Mail : Acceptlsw.vsp@gmail.com. Ph : 81437 91423

PASSPORT LOST
I, SERAJ SINGH, S/o.Inder Singh (Late) residing at LIG-9, APHB Colony, Pedagantyada, Visakhapatnam-530044, Andhra Pradesh. I have lost my original PASSPORT bearing No: L1623424 while travelling from Pedagantyada to Vizag City. If anyone found Please contact : 98496 21130

Real Estate

PLOT FOR SALE
■ GVMC పరిధి 5 లక్షలకే 116 గజాలు 150, 200 గజాలు 9 బిట్లు కలవు. ఇల్లులు, స్కూలు, బస్సులు దగ్గరలో కలవు. స్టీల్‌ప్లాంట్‌కి 7 కి.మీ.లో. ఫోన్: 73864 14017 [V-778225]

Services

■ ప్రముఖ బ్యాంక్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జనరల్ షిఫ్ట్ & నైట్ షిఫ్ట్, 26 వర్కింగ్ డేస్, సాలరీ + ఇన్సెంటివ్స్, Age = 40 to 53, నైట్ షిఫ్ట్ MVP కాలనీ / గాజువాక, జనరల్ షిఫ్ట్ : కశింకోట, అనకాపల్లి. ఫోన్: 89857 49622 [V- 5589]

■ అనకాపల్లి మరియు విశాఖపట్నంలలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. 12 గం|| డ్యూటీకి జీతం : 9,000/- to 10,500/-. + PF, ESI. వయస్సు : 22-45 సం.లు, Qlf : 10th Pass/Fail. ఫోన్: 77804 78285, 93929 96888 [V- 1682]

■ సెక్యూరిటిగార్డులు మధురవాడ ఏరియాలో కావలెను. 8 గం|| డ్యూటీ, జీతం : 10,470/-, PF, ESI 3480/-. Qlf : 10th వరకు, వయస్సు - 50సం|| లోపు. సంప్ర : 92909 93444, 95506 06916 [V- 775072]

■ హైదరాబాదులోని అప్తా హోం కేర్ లో పనిచేయుటకు 21-45సం||గల M/F కేర్‌టేకర్స్/ అటెండర్లు, కావలెను. జీతం: 16-18వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. 6300813664 [G-332]

■ ప్రముఖ హౌస్ కీపింగ్ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల ఫీల్డ్‌ఆఫీసర్స్ సూపర్ వైజర్స్, షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు హెల్పర్స్, టైలర్స్ కావలెను.Sal: 15k to 25k, ఫోన్: 9989806121. [HA-10021]

■ ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్ట్‌లలో కార్గో సూపర్‌వైజర్స్ హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటి సూపర్‌వైజర్స్ లోడర్స్, సెక్యూరిటి గార్డ్స్, కావలెను. జీతం: 21K to 30K, రూం+మీల్స్ ఫ్రీ. Q: 5th to డిగ్రీ. 8886186894. [H-778953]

■ విశాఖ జిల్లా, అనకాపల్లి, నర్సీపట్నం, తుని, యలమంచిలి ఏరియాల ప్రముఖ బ్యాంకుల లో పనిచేయుటకు రికవరీ ఆఫీసర్లు కావలెను. అర్హత: ఇంటర్, జీతం: 16వేలు. 7993680951 [G-342]

BUSINESS OFFER
■ Apes Group కంపెనీ ప్రావైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం కమిషన్, ✆ 9667730921. [T-1159685]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 3001]

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం|| వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90103 92178 [V- 775073]

SEPTIC TANK CLEAN
■ అఖిల్ సెప్టిక్ క్లీన్ హైటెక్ మిషన్‌తో అతి తక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన, లేకుండా క్లీన్ & పైపు జామ్స్ క్లీన్ చేయబడును. లోడుకు రూ. 1000/-. ఫోన్ : 96664 88883, 86393 63139 [V-1680]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటిదగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్ టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776241]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
మురళీనగర్, మాధవధార : 90101 33346
NAD, కంచరపాలెం : 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి : 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్ : 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం : 90101 96663
గాజువాక : 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

జగనన్న కాలనీల నిర్మాణ పనులు వేగవంతం

- అధికారులకు వీఎంఆర్‌డీఏ కమిషనర్, కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

దొండపర్తి(విశాఖ దక్షిణ): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, జోనల్ కమిషనర్లు, హౌసింగ్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ వారీగా ఇళ్ల మంజూరు, కొత్త నిర్మాణ ప్రతిపాదనలు, మొత్తం గ్రౌండింగ్ చేసిన ఇళ్లు, ఇసుక డిపోలు, వీఎంఆర్‌డీఏ చేపడుతున్న మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికి ఇంటి నిర్మాణం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కోర్టు కేసులు కారణంగా విశాఖలో ఇళ్ల నిర్మాణంలో వెనుకబడి ఉన్నామన్నారు. రెట్టింపు వేగంతో అధికారులు పని చేయాలని సూచించారు. సొంత ఇల్లు లేని వారికి ప్రభుత్వం అందించిన స్థలాల్లో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జియో టాగింగ్, రిజిస్ట్రేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రారంభం కాని ఇళ్లను వెంటనే మొదలు పెట్టాలన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టే వాళ్లకు రూ.35 వేలు రుణం అందించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ రుణాల కోసం బ్యాంకు అకౌంట్లు తక్షణమే తెరవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌ను లే అవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలని, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం ఇళ్ల నిర్మాణ ప్రగతిలో వృద్ధి కనిపించాలని అధికారులను, ఏజెన్సీలను ఆదేశించారు. ఫేజ్–1 లో పూర్తయిన ఇళ్లకు అన్ని సదుపాయాలు కల్పించాలని, వార్డ్ సచివాలయాల్లో పని భారం బ్యాలెన్స్ చేయాలని హౌసింగ్ పీడీకి చెప్పారు. వీఎంఆర్‌డీఏకి సంబంధించి అన్ని లేఅవుట్లలో భూమి చదును పనులు పూర్తి చేయాలన్నారు. నీటి ట్యాంకులు, రాత్రి పూట పనిచేసేందుకు లైట్లు, గోదాముల నిర్మాణం పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

- గతేడాది 6,385 కేసులు నమోదు చేశాం
- విద్యుత్ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల పైనా విచారణ
- ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఏవీఎల్ ప్రసన్నకుమార్



సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చీఫ్ విజిలెన్స్ అధికారి ఏవీఎల్ ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు. 2022–23కి సంబంధించిన వార్షిక నివేదికని ఆయన విడుదల చేశారు. ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ మల్లారెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిల్స్ పరిధిలో 2022 జనవరి 1 నుంచి డిసెంబర్ 24 వరకూ నిర్వహించిన దాడుల్లో ఆపరేషన్ వింగ్, డీపీఈ వింగ్ సహకారంతో మొత్తం 6,385 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఈ కేసులకు సంబంధించి అసెస్మెంట్, కాంపౌండింగ్ రుసుము కింద రూ.5.03 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ.. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. 2022లో 277 క్వాలిటీ కేసుల్ని విజిలెన్స్ సిబ్బంది నమోదు చేసి రూ.3.38 కోట్లు అపరాధ రుసుం వసూలు చేసినట్లు వెల్లడించారు. అదే విధంగా.. విద్యుత్ శాఖ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల పైనా విచారణలు వేగవంతం చేసినట్లు సీవీవో ప్రసన్నకుమార్ వెల్లడించారు. విద్యుత్ ఉద్యోగులపై 83 పిటిషన్లు రాగా.. ఇందులో 58 పిటిషన్లపై విచారణ పూర్తి చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ సీఎండీకి నివేదికలు పంపించినట్లు తెలిపారు. ఏదైనా విద్యుత్‌కి సంబంధించిన సమస్య ఉత్పన్నమైనా, సమస్య పరిష్కరించేందుకు సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగినా.. 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

క్రమశిక్షణ న్యాయవాదుల ఉన్నతికి సోపానం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి



న్యాయమూర్తి రామ శ్రీనివాసరావును సన్మానిస్తున్న విశాఖ న్యాయవాదుల సంఘం సభ్యులు

విశాఖ లీగల్ : క్రమశిక్షణ న్యాయవాదుల ఉన్నతికి సోపానమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. సోమవారం జిల్లా కోర్టులోని న్యాయవాదుల గ్రంథాలయంలో విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదవిరమణ చేసిన పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.రామశ్రీనివాసరావు సన్మాన సభ జరిగింది. సభలో న్యాయమూర్తి గోపి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయమూర్తి శ్రీనివాసరావు యువ న్యాయవాదులకు ఒక నిఘంటువని పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమూర్తి ప్రస్థానం అందరికి ఆదర్శమన్నారు. అనంతరం సంఘం కార్యదర్శి వై.వేణుగోపాల్, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి తిరుమల రావు, శాశ్వత ప్రజా న్యాయపీఠం న్యాయమూర్తి జి.వల్లభ నాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్, నమ్మి సన్యాసిరావు, పోక్సో కోర్టు ప్రత్యేక ఏపీపీ కరణం కృష్ణలు న్యాయమూర్తి శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు నిరంతర విద్యార్థులుగా అభివర్ణించారు. విశాఖ న్యాయవాదుల సహకారం మరువలేనిదన్నారు. అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

సీతమ్మధార/అల్లిపురం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. శంకరమఠంకు చెందిన హేమాల ఆనంద్‌పై ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కేసులు ఉన్నాయి. అల్లిపురానికి చెందిన గున్న స్వామిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది కేసులు ఉన్నాయి. ఇప్పటికే ఇరువురు పైన రౌడీషీట్ తెరిచారు. 21.5 కిలోల గంజాయి కలిగిన ఉన్న వీరిని కైలాసపురం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

కుటుంబ సభ్యుల నిరసన : ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్ల కుటుంబ సభ్యులు చంటి పిల్లలతో సహా ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, నిందితుల కుటుంబ సభ్యులకు మధ్య తోపులాట జరగటంతో వెంటనే వారిని జిల్లా కోర్టుకు తరలించారు. అక్కడ రౌడీ షీటర్ల కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. తమ వారిపై అన్యాయంగా గంజాయి కేసులు నమోదు చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ కూడా కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో నిందితులను న్యాయమూర్తి ఇంటికి తరలించారు.

'శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు'

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వీవీ వామనరావు అన్నారు. చంద్రన్న కానుకల పంపిణీలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి ఆయన, నిర్వాహకులు చేసిన తప్పును ప్రభుత్వం, పోలీసులపై నెట్టివేసి..శవ రాజకీయాలకు చంద్రబాబు తెర తీశారని ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ప్రచారంపై యావ తప్పితే.. ప్రజల ప్రాణాల పట్ల లేదన్నారు. సభకు వచ్చిన జనాలకు సరైన ఏర్పాట్లు చేయలేదన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత చంద్రబాబుదేనని.. ఇది ఎంతమాత్రం ప్రభుత్వ, పోలీసుల వైఫల్యం కాదన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లకు అభినందన

విశాఖ స్పోర్ట్స్: భారత్ రైల్వేస్ జట్టు సభ్యులు వెంకటరావు, గణేష్‌లను వాల్తేర్ డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి అభినందించారు. వాల్తేర్ డివిజన్‌కు చెందిన వీరిద్దరూ రైల్వేస్ జట్టు తరపున సీనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. కొల్లాంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో రైల్వేస్ జట్టు 39–38, 35–24 పాయింట్ల తేడాతో తమిళనాడుపై విజయం సాధించింది. ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌భాటి పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ — విశాఖపట్నం శాఖ
30-9-3, శారదా వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్ : 0891 - 2568910

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన
"APPENDIX - IV-A" (రూలు 8 (6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 6 (2) & 8(6) నిబంధనలలో చదవబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన
ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంకు, విశాఖపట్నం శాఖ యొక్క అధీకృత అధికారి లాంఛనంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు, అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.19.01.2023న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం శాఖకు బకాయి మొత్తం ది.02.01.2023 నాటికి రూ.1,32,85,468/- (అక్షరాలా ఒక కోటి ముప్పై రెండు లక్షల ఎనభై ఐదు వేల నాలుగు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రము) తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి.
ఋణగ్రహీత : శ్రీమతి జె. అనురాధ, యజమానురాలు : మెస్సర్స్ క్వాలిటెక్, నాల్గవ అంతస్తు, 4ఎఫ్-2, ఫ్లాట్ నెం.63, డాక్టర్స్ కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం - 530013.
రిజర్వుధర మరియు ధరావత్తు ఈ క్రింద ఇవ్వబడింది
అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

తనఖావుంచబడిన/ తనఖా చేయబడిన ఆస్తి వివరణ :	రిజర్వు ధర	ధరావత్తు	ఈ - వేలము తేది సమయం & అవధి	పూర్వపు ఎన్‌కంబ్రెన్స్
శ్రీమతి జక్కుల అనురాధకి చెందిన ఆస్తి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మద్దిలపాలెం గ్రామ టి. సర్వే నెం. 2బి, సీతమ్మధార, డాక్టర్స్‌కాలనీ లోని మొత్తం 510 చ॥గ॥లు విస్తీర్ణములోని అవిభాజిత మరియు అనిర్దేశిత భాగము 51 చ॥గ॥లు విస్తీర్ణము గల స్థలంలో నిర్మితమైన సెల్లార్ గ్రౌండ్ ఫ్లోర్ ప్లస్ నాలుగు పై అంతస్థులు కలిగిన భాగ్యవతి ఎన్‌క్లేవ్ నాల్గవ అంతస్తులోని 1620 చ॥అ॥లు అవిభాజిత మరియు అనిర్దేశిత భాగములతో ఫ్లాట్ నెం.4ఎఫ్-2 మరియు సెల్లార్‌లోని అవిభాజిత మరియు అనిర్దేశిత భాగము 100 చ॥అ॥ల ఒక కార్ పార్కింగ్‌తో కలిపి యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : ఫ్లాట్ నెం.64, దక్షిణం : 40 అ.ల వెడల్పు గల రోడ్డు, పడమర : ఫ్లాట్ నెం.62, ఉత్తరం : ఫ్లాట్ నెం.55. నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నెం.4ఎఫ్-2 కి హద్దులు : తూర్పు : శూన్యాకాశము, దక్షిణం : ఉమ్మడి వరండా, పడమర : శూన్యాకాశము, ఉత్తరం : శూన్యాకాశము.	రూ.100.00 లక్షలు (అక్షరాల ఒక కోటి రూపాయలు మాత్రము)	రూ.10.00 లక్షలు (అక్షరాల పది లక్షల రూపాయలు మాత్రము)	19-01-2023 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు. బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-	లేదు

ఆస్తి ఐడి నెం. : ఐడిఐబిఐబిఐడిఏజి25
ఇ-వేలంలో పాల్గొనడానికి ఇయమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.18.01.2023 సాయంత్రం గం.5:00 నిలకు
వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ MSTC LTD. వారి వెబ్‌సైట్ (www.mstcecommerce.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహానీయబడినది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ నెం.033-22901004 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించండి. MSTC LTD. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి ibapiop@mstcecommerce.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి ibapifin@mstcecommerce.com సంప్రదించవచ్చును.
ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫోటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ibapi.in ను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరాలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ '18001025026' మరియు '011-41106131' నందు సంప్రదించండి.
https://ibapi.in మరియు www.mstcecommerce.comలో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నపుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.
ప్రదేశం : విశాఖపట్నం, తేది : 02-01-2023 — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం.

ఇండియన్ బ్యాంక్ — విశాఖపట్నం శాఖ
30-9-3, శారదా వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్ : 0891 - 2568910

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన
"APPENDIX - IV-A" (రూలు 8 (6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 6 (2) & 8(6) నిబంధనలలో చదవబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన
ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంకు, విశాఖపట్నం శాఖ యొక్క అధీకృత అధికారి లాంఛనంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు, అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.19.01.2023న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం శాఖకు బకాయి మొత్తం ది.02.01.2023 నాటికి రూ.1,11,05,755.32 పై. (అక్షరాల ఒక కోటి పదకొండు లక్షల ఐదు వేల ఏడు వందల యాభై ఐదు రూపాయలు మరియు ముప్పై రెండు పైసలు మాత్రము) తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి.
ఋణగ్రహీత : 1) శ్రీ జక్కుల అఖండ రావు, తండ్రి : జక్కుల సుబ్రమణ్యం, గ్రౌండ్ ఫ్లోర్, జిఎఫ్-1, ఫ్లాట్ నెం.63, డాక్టర్స్ కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం - 530013. 2) శ్రీమతి జక్కుల అనురాధ, భర్త : అఖండరావు, గ్రౌండ్ ఫ్లోర్, జిఎఫ్-1, ఫ్లాట్ నెం.63, డాక్టర్స్ కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం - 530013.
రిజర్వుధర మరియు ధరావత్తు ఈ క్రింద ఇవ్వబడింది
అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

తనఖావుంచబడిన/ తనఖా చేయబడిన ఆస్తి వివరణ :	రిజర్వు ధర	ధరావత్తు	ఈ - వేలము తేది సమయం & అవధి	పూర్వపు ఎన్‌కంబ్రెన్స్
ఆస్తి యజమాని : శ్రీ జక్కుల అఖండ రావు మరియు శ్రీమతి జక్కుల అనురాధ. విశాఖపట్నం రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా మరియు జివియమ్‌సి పరిధిలోని మద్దిలపాలెం గ్రామ సర్వే నెం. 2బి, టిపి నెం.67/79 లోని అవిభాజిత మరియు అనిర్దేశిత భాగము 51 చ॥గ॥లు లేదా 42.64 చ॥మీ॥లు విస్తీర్ణము గల ఫ్లాట్ నెం.63లోని స్థలంలో నిర్మితమైన భాగ్యవతి ఎన్‌క్లేవ్ మొదటి అంతస్తులోని 1621 చ॥అ॥లు ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-2 మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లోని అవిభాజిత మరియు అనిర్దేశిత భాగము 100 చ॥అ॥ల ఒక కార్ పార్కింగ్‌తో కలిపి యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు వైపు : ఫ్లాట్ నెం.64, పడమర వైపు : ఫ్లాట్ నెం.62, ఉత్తరం వైపు : ఫ్లాట్ నెం.55, దక్షిణం వైపు : 40 అ.ల వెడల్పు గల రోడ్డు. ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు వైపు : శూన్యాకాశము, పడమర వైపు : శూన్యాకాశము, ఉత్తరం వైపు : శూన్యాకాశము, దక్షిణం వైపు : ఉమ్మడి వరండా, మెట్లు మరియు లిఫ్ట్.	రూ.110.00 లక్షలు (అక్షరాల నూట పది లక్షల రూపాయలు మాత్రము)	రూ.11.00 లక్షలు (అక్షరాల పదకొండు లక్షల రూపాయలు మాత్రము)	19-01-2023 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు. బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-	లేదు

ఆస్తి ఐడి నెం. : ఐడిఐబిఐబిఐడిఏజి20
ఇ-వేలంలో పాల్గొనడానికి ఇయమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.18.01.2023 సాయంత్రం గం.5:00 నిలకు
వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ MSTC LTD. వారి వెబ్‌సైట్ (www.mstcecommerce.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహానీయబడినది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ నెం.033-22901004 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించండి. MSTC LTD. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి ibapiop@mstcecommerce.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి ibapifin@mstcecommerce.com సంప్రదించవచ్చును.
ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫోటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ibapi.in ను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరాలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ '18001025026' మరియు '011-41106131' నందు సంప్రదించండి.
https://ibapi.in మరియు www.mstcecommerce.comలో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నపుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.
ప్రదేశం : విశాఖపట్నం, తేది : 02-01-2023 — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం.